




మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి

ఇక బిల్లుల షాక్..



అమల్లోకి ట్రూ అప్ ఛార్జీలు | **సామాన్యుల పాలిట భారం**

గత వైసిపి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు నాయుడు బాదుడే బాదుడు కార్యక్రమాన్ని చేసి నిరసన తెలిపారు. నేడు అధికారంలో ఉన్న సిఎం చంద్రబాబు నాయుడు ప్రజలపై విద్యుత్ ఛార్జీలు పెంచి మోయలేని భారాలు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ట్రూ అప్ సర్దుబాటు అంటూ వినియోగదారులు వాడే విద్యుత్ కన్నా అదనపు ఛార్జీలు విధించేందుకు సిద్ధమయ్యారు. ట్రూ అప్ ఛార్జీల వసూలు ఈ నెల నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో ఈ నెల నుంచి సామాన్యులకు విద్యుత్ బిల్లుల షాక్ తగలనుంది...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ట్రూ అఫ్ ఛార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం మళ్లీ దాదాపు రూ.12 వేల కోట్లు పెంచేందుకు సిద్ధమైంది. ట్రూ అప్ ఛార్జీలపై ప్రజాభిప్రాయ స్వీకరణ తూతూ మంత్రంగా నిర్వహించి అభ్యంతరాలు పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఏది అనుకుంటే అది చేస్తూ ప్రజలపై భారాలు వేస్తూనే ఉంది. పెరిగిన బిల్లులు చూసుకుంటే అసలు విద్యుత్ యూనిట్ ధర కన్నా అదనపు చార్జింగ్ ఎక్కువ అవుతున్నాయి. దీనితో వినియోదారులు లబోదిబో అంటున్నారు. ప్రజాసంఘాలు, ప్రతిపక్ష పార్టీలు, వామపక్ష పార్టీలు వినియోగదారుల పక్షాన ఏకంగా రోడ్లపైకి వచ్చి రాస్తారోకోలు కార్యాలయాలు ముందు ధర్నాలు, నిరసనలు తెలిపినా ఏమాత్రం స్పందించకుండా అధికారులు, పాలకులు దున్నపోతు మీద వాన పడ్డట్టు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలు గాలికి వదిలేసి ప్రజలు ఏమైతే మాకేమి అని అధికారంలో ఉన్న ప్రభుత్వం భారాలు వేస్తూ పోతుంది. ఒకపక్క ఇంధనం పెట్రోల్ ,డీజిల్ ధరలు పెరిగి వాటి ప్రభావం వల్ల నిత్యవసర సరుకులపై పడి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు ప్రజలపై ప్రభుత్వాలు భారాలు వేస్తూనే ఉంది. 2023 -24 సంవత్సరానికి సంబంధించి రూ.3700 కోట్లను డిస్కంలు ఇప్పటికే వినియోగదారుల నుండి ముక్కు పిండి వసూలు చేశాయి. ఇవి కాకుండా 2022-23 సంవత్సరానికి సంబంధించి సర్దుబాటు పేరుతో రూ.6.072 కోట్లు వినియోగదారుల నుండి వసూలు చేసుకోవాలని 20 రోజుల క్రితమే ఎపిఇఆర్సి ఉత్తర్వులు విడుదల చేసింది. మళ్లీ ఇప్పుడు మరో రూ.ఎనిమిది వేల కోట్లు వసూలు చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కోరింది.

స్మార్ట్ బాదుడుకూ సిద్ధం

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 12.24 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ సర్వీసులన్నీ త్వరలో స్మార్ట్ మీటర్ల కిందకు రాబోతున్నాయి. ఒక్కో స్మార్ట్ మీటర్‌ను రూ.12 వేలు పెట్టి కొనాల్సి వుంటుంది. ఈ భారాన్ని వినియోగదారుడే భరించాలి. స్మార్ట్ మీటర్లను అందించే వెసులు బాటును ఆదాని గ్రూప్ సంస్థకు ప్రభుత్వం ఇచ్చినట్లు తెలిసింది.విడతల వారీగా జిల్లాలో స్మార్ట్ మీటర్లను అమలు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు సిద్ధమయారు. మొదటి విడతగా ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తయ్యాక రెండో విడతగా వ్యాపార సముదాయాలకు, పరిశ్రమలకు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించే ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఆ తరువాత మూడో విడతగా గృహాలకు ఈ స్మార్ట్ మీటర్లను పెట్టనున్నారు. స్మార్ట్ మీటర్లను వినియోగించుకుంటే నిత్యం వాడే సెల్ ఫోన్ లాగే స్మార్ట్ మీటర్లకు ముందుగానే రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. రీఛార్జ్ చేసుకోవడం మరిచిపోతే కరెంట్ దానికదే కట్ అయిపోతుంది. మళ్లీ రీఛార్జ్ చేయాలంటే ఆన్‌లైన్‌లో మళ్లీ రిజిస్టర్ చేసుకోవాలి. ఈ తతంగాన్ని గ్రామీణ ప్రాంతాల్లో చేసుకోలేరనే వాదనలు ప్రజల నుండి వినిపిస్తున్నాయి. దీని వలన విద్యుత్ శాఖకు లాభం ఉండొచ్చు కానీ సాధారణ ప్రజలకు ఇబ్బందులు తప్పవనే అభిప్రాయం వ్యక్తమౌతుంది. ప్రస్తుతం నెలకు ఒక్కసారి విద్యుత్ బిల్లులు కడుతున్నాం. స్మార్ట్ మీటర్లు వస్తే ఇళ్లకు వస్తే రీ ఛార్జ్ ఎప్పుడు అయిపోతే అప్పుడు వినియోగదారులు కట్టుకోవాల్సిందే.

పట్టణాల్లో పరిశ్రమల స్థాపనకు ఉద్యమం

- తాగునీళ్లివ్వని పాలకుల విధానాలను ఎండగడదాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి
- సిపిఎం కర్నూలు నగర 3వ మహాసభ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జిల్లా కేంద్రంగా ఉన్న కర్నూలు నగరంలో ఏటేటా పెరుగుతున్న జనాభాతో పాటు గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చి స్థిరపడుతున్న వారి సంఖ్య కూడా గణనీయంగా ఉందని, ఈ నేపథ్యంలో పెరుగుతున్న ఎక్స్‌టెన్షన్ కాలనీలకు కనీసం మంచినీళ్లను కూడా సరిగా సరఫరా చేయని పాలకుల విధానాలను ఎండగడదామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. సిపిఎం కర్నూలు న్యూ సిటీ మూడవ మహాసభను ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఎస్ఎస్‌ఫంక్షన్ హాలులో ప్రారంభించారు. అంతకుముందు మహాసభ ప్రారంభ సూచికగా సిపిఎం పతాకాన్ని సిపిఎం న్యూ సిటీ కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.సాయిబాబా ఎగరవేశారు. నగర నాయకులు ఆర్.నరసింహులు, కె.అరుణమ్మ, శంకర్‌ల అధ్యక్షతన మహాసభ నిర్వహించారు. కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల మాట్లాడుతూ రాయలసీమ ముఖద్వారంగా ఉన్న కర్నూలు నగరానికి ఉపాధి లేక యువత నిరుద్యోగంతో అల్లాడుతున్నారన్నారు. చదువుకున్న యువత ఉద్యోగాల కోసం ముంబయ్, బెంగళూరు, హైదరాబాద్, మద్రాసు లాంటి ప్రాంతాలకు వలసలు పోతున్న పరిస్థితి ఉందన్నారు. చదువుకోని యువత ఉపాధి లేక పెరుగుతున్న ధరలతో కొనితినలేని పరిస్థితి దాపురించిందన్నారు. నగర పరిధిలో ఉన్న పరిశ్రమల్లో స్థానికులకు ఉన్న ఉపాధి అవకాశాలు తక్కువేనన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి అయినా ప్రత్యేకంగా దృష్టి పెట్టి కొత్త పరిశ్రమలను జిల్లాకు తెచ్చి ఉపాధి అవకాశాలను సృష్టించాలన్నారు. పెరుగుతున్న కొత్త కాలనీలలో లక్షలు వెచ్చించి స్థలాలు కొని ఇల్లు కట్టుకున్న వారికి మౌలిక సౌకర్యాలు లేక అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారన్నారు. చివరికి తాగేందుకు మంచినీళ్లు కూడా లేకపోవడం దారుణమన్నారు. సిపిఎం నగర కమిటీగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాల కారణంగా ప్రజలు మోస్తున్న భారాలకు వ్యతిరేకంగా ఉద్యమించడంతో పాటు, ప్రజలకు ఉపాధి, గృహ సౌకర్యం, మౌలిక సదుపాయాల కల్పన, ఆరోగ్యం, నాణ్యమైన విద్య కోసం నికరమైన పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

పిఎన్ఎం విప్లవ గీతాలు

సిపిఎం న్యూ సిటీ నగర మూడవ మహాసభ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు జిబి. మధ్యలేటి, ఇ. రాజు, లోకేష్, బాలు, నాగ సుంకన్న, నోమేశ్వరి, సరిత, లక్ష్మి లు, ఓ అరుణ పతాకమా, ఎర్రజెండా గుండెల్లో ఒరిగినవాళ్లు రా, వర్ధిల్లవమ్మా ఎర్రజెండా, సిపిఎం విధానాలు నికరం',లాంటి పాటలను పాడి సభకు హాజరైన వారిని చైతన్యపరిచారు.


కార్యదర్శి నివేదికను ప్రవేశ పెడుతున్న రాముడు

వేసవికి నీటి ఎద్దడి లేకుండా చర్యలు

- మార్చి నాటికి 68 చెరువులను నింపుతాం - రబీ పంటలకు నీటిని అందించేలా ప్రణాళిక
- ప్రజాశక్తితో నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ బాల చంద్రారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

జిల్లాలో వచ్చే వేసవి కాలానికి తాగునీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలను తీసుకుంటున్నాం. రబీ ఆరుతడి పంటలకు సమృద్ధిగా నీటిని అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేస్తాం' అని నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ బాలచంద్రారెడ్డి తెలిపారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు..

జిల్లాలో చెరువులు ఎప్పటికి నింపుతారు?

ఎస్ఇ : జిల్లాలో 68 చెరువుల నింపడం ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరుగుతుంది. ఇప్పటికి 20 చెరువులు పూర్తిగా నింపాము. ఇంకోక 20 చెరువులు అరకొరగా నింపాము. మొత్తం 68 చెరువులను మార్చి 2025 నాటికి పూర్తిగా నింపేలా చర్యలు తీసుకున్నాం. ఆ దిశగా పనులు ప్రారంభించాం. జిల్లా ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు ప్రకారం ముందుకు వెళ్తున్నాం.

తుంగభద్ర ద్వారా మనకు రావాల్సిన నీటి వాటా ఎంత ఇంకా ఎంత ఉంది?

ఎస్ఇ : తుంగభద్ర డ్యామ్ నుండి జిల్లా వాటా 31.9 టీఎంసిలు. ఇందులో 10 టీఎంసీల నీటిని డ్యామ్ ద్వారా మిగిలిన నీటిని ప్రవాహం నుండి తీసుకోవాలి. ప్రస్తుతం 10 టీఎంసీల రావాల్సి ఉంది.

గాజులదిన్నె ప్రాజెక్టు నీటి వాటా ఎంత ? ఎంత నీరు ఉంది. రబీ పంటలకు నీరు అందిస్తారా ?

ఎస్ఇ : జిడిపిలో ప్రస్తుతం 2.8 టీఎంసీల నీరు ఉంది. ఈ ఆయకట్టు కింద 24 వేల ఎకరాలు పంటలు పండుతున్నాయి. ప్రస్తుతం రబీ పంటలు వేయడానికి నీటిని అందిస్తాం. హంద్రీనీవా ద్వారా 150 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నాము. 2 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాలకు పెట్టడం జరుగుతుంది.

ఎల్ఎల్‌సి, గురు రాఘవేంద్ర ప్రాజెక్టుల ఆయకట్టు ఎంత? రబీ పంటలకు నీరు అందిస్తున్నారా ?

ఎస్ఇ : ఎల్ఎల్‌సి నీటిని ఖరీఫ్‌లో అందించాము. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ పూర్తి అయింది. ఇందులో 45 వేల ఎకరాలకు నీటిని అందించడం జరిగింది. గురు రాఘవేంద్ర ప్రాజెక్టుకు పంపింగ్ ద్వారా 9 లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 63.889 ఎకరాలకు నీటిని అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. పంపింగ్ జరుగుతుంది.

సుంకేసుల ప్రాజెక్టు నిర్వహణ, గేట్లు మరమ్మతులకు నిధులు లేవన్నారు. వాటి నిర్వహణ ఎలా చేస్తున్నారు?

ఎస్ఇ : సుంకేసుల ప్రాజెక్టు గేట్లకు మరికొన్ని మరమ్మతులకు 134 వర్కులకు గాను రూ.10 కోట్లు మంజూరు అయ్యాయి. టెండర్లు నిర్వహించాము. అగ్రిమెంట్ దశలో ఉన్నాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం. సుంకేసులలో 1.2 టీఎంసీల నీరు లభ్యత ఉంది.

గుండ్రేవుల ప్రాజెక్టు ఈ ఏడాదియైనా రూపు దాలుస్తుందా ?

ఎస్ఈ : గుండ్రేవుల ప్రాజెక్టు ఇతర రాష్ట్రాల పరిధిలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉంది. దాదాపు 4500 కోట్ల ఎస్టిమేట్ అవుతుంది. అందులో ల్యాండ్ అక్విషన్స్‌తో పాటు కొన్ని గ్రామాల ముంపు కూడా ఉంది. వాటిపై కూడా చర్చించాలి. రాష్ట్ర ప్రభుత్వం గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి గతంలోనే సానుకూల ఆలోచన చేపట్టింది.

లైనింగ్ పనులు ఎంత వ్యయంతో మంజూరు అయ్యాయి?

ఎస్ఇ : జిల్లాలో లైనింగ్ సపోర్ట్ ఫర్ సెంప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ కింద కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల అనుసంధానం ద్వారా జరుగుతుంది. అందులో రూ.550 కోట్ల పనులు నిర్వహించాలి. అవి త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతితో చేయాలి.

సాగునీటి సంఘాల ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తున్నారు?

ఎస్ఇ : మైనర్ ఇరిగేషన్ నీటి సంఘాల ఎన్నిక డిసెంబర్ 8న జరుగుతుంది. మేజర్ నీటి సంఘాల ఎన్నిక డిసెంబర్ 11న, అలాగే పెద్ద ప్రాజెక్టల అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు ఎన్నిక డిసెంబర్ 14న నిర్వహించేలా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. ఉన్నతాధికారుల నిర్ణయాల ప్రకారం సజావుగా నిర్వహించేలా అన్ని రకాల చర్యలు జాగ్రత్తలు చేపట్టాము.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎస్ఈ : జిల్లాలో ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిశాయి. అన్ని చోట్లా నీరు ఉంది. ప్రతి



చోట కూడా వేసవి తాగునీరు ఇబ్బందులు తలెత్తకుండా ఇరిగేషన్, మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సమన్వయంతో చర్చించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాము. సాధ్యమైనంత వరకు సమస్యలు ఉండకుండ చర్యలు చేపడుతున్నాము.



ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష - జిల్లా వ్యాప్తంగా ఎయిడ్స్ అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ డే -2024 సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలను నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ , నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుండి రాజ్‌విహార్ సెంటర్ వరకు నిర్వహించారు. ర్యాలీని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని 'హక్కుల మార్గాన్ని అనుసరించండి - నా ఆరోగ్యం, నా హక్కు' అనే నినాదంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎఆర్‌టి కేంద్రాలు, లింక్ ఎఆర్‌టి కేంద్రాల ద్వారా ఉచితంగా మందులు , అవసరమైన సిడి-4 వైరల్ లోడ్ పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎఆర్‌టి మందులు క్రమం తప్పకుండా ప్రతిరోజూ వాడాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్, ఎన్‌హెచ్ఎం డిపిఎంఒ డాక్టర్ ఉమ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగ ప్రసాద్‌బాబు, జిల్లా మలేరియా అధికారి నూకరాజు, ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ రఘురాం, ఎన్‌సిసి థర్డ్ ఆఫీసర్ గీతాంజిని, డిఎస్‌డిఒ భూపతి, జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం క్లస్టర్ ప్రోగ్రాం అధికారి వెంకట రత్నం పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

రాయలసీమ విశ్వవిద్యాలయంలో : రాయలసీమ విశ్వవిద్యాలయం ప్రారంభంలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు ఎయిడ్స్ డే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎన్‌టికె నాయక్ ప్రారంభించారు.

ఒకేషనల్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో : బి-క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల లో ఎయిడ్స్ డే అవగాహన ర్యాలీని ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. లెక్చరర్స్ రామకృష్ణ, మల్లికార్జున, సోమేష్, సుజాత, లక్ష్మి, మల్లేశ్వరుడు, ఉల్గోజి రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పురుషుల డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో : ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎయిడ్స్ డే అవగాహన ర్యాలీని కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఇందిరా శాంతి ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపల్ హేమంత్ కుమార్, రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ బి.సుజాత, సభ్యులు సోమశేఖర్, ఆర్.కామ్లీ నాయక్, జి.నాగేశ్వర్ రావ్, ఎస్.షాజిదాబీ విద్యార్థులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్




ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలులోని సలాంఖాన్ ఎస్‌టియు భవనంలో ఎస్‌టియు జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న మాట్లాడుతూ మెరుగైన పిఆర్‌సి ఇస్తామని మేనిఫెస్టోలో తెలిపారన్నారు. 12వ పిఆర్‌సి అమలు చేయాల్సిన గడువు ఇప్పటికే 17 నెలలు ఆలస్యమైందన్నారు. 30శాతం మధ్యంతర భృతి ప్రకటించి ఆపిర్‌సి కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్లకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి టికె. జనార్దన్, రాష్ట్ర ప్రధాన కార్యవర్గ సభ్యులు సి.నాగరాజు, బి.వెంకటేశ్వర్లు, బి.నాగరాజు, బి.సుంకన్న, సీనియర్ నాయకులు సి.రమేష్ షఫీ, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి సామ్రాట్ బిరుదుతో జగన్‌ను సత్కరించాలా?

సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఎద్దేవా

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్



వైసిపి అధినేత జగన్ రాష్ట్రానికి ఏం చేశారని ఆయనను సత్కరించి, శాలువా కప్పాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేసి తొమ్మిదిసార్లు కరెంటు ఛార్జీలు పెంచినందుకు, ఐదేళ్లు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేసినందుకు శాలువా కప్పాలా అని ప్రశ్నించారు. దేశంలోనే అవినీతి సామ్రాట్ అని జగన్‌కు సన్మానం చేయాలా అంటూ విమర్శించారు. విద్యుత్ వ్యవస్థలను రూ. లక్ష కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టేశారని దుయ్యబట్టారు. జగన్ పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆరోపించారు. జగన్ అవినీతి ఆనాడు రాష్ట్రం దాటితే.. ఇప్పుడు దేశం దాటిందన్నారు. రాష్ట్రం పరువు తీయడమే కాకుండా గొప్పలకు పోతున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. తన తప్పులను కప్పిపుచ్చుకొని అవినీతిని కూడా గొప్పగా చెప్పుకోవడం జగన్‌కు సాధ్యమని విమర్శించారు.

బాలికలకు కరాటే రక్షణ కవచం

-గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ
-తైక్వాండో క్రీడాకారులకు బ్యాగులు, మంకీ క్యాప్ లు పంపిణీ

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ప్రస్తుతం ఉన్న సమాజంలో బాలికల రక్షణకు కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ సరైన రక్షణ కవచమని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు నగరంలోని కొండారెడ్డి బురుజు మున్సిపల్ పార్కులోతై క్వాండో శిక్షకుడు టి. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు ఆయన బ్యాగులతో పాటు ప్రస్తుతం ఉన్న చలి నుంచి రక్షణ కోసం మంకీక్యాప్‌లు పంపిణీ చేశారు. డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో బాలికలపై దాడులు, అత్యాచార ఘటనలు అధికంగా జరుగుతున్నాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఎంతో అవసరమని చెప్పారు. బాలికల తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలను వెంట ఉండి కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇప్పించడం వల్ల వారు ఎలాంటి ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురైనా వాటిని ఎదుర్కొంటారన్నారు. కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందడం వల్ల బాలికలు తమను తాము రక్షించుకోవడంతోపాటు ఆపదలో ఉన్నవారిని సైతం రక్షించే అవకాశం ఉంటుందని వివరించారు. ఏ దేశంలో అయితే స్త్రీలు స్వేచ్ఛగా, ధైర్యంగా బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాగలుగుతారో అలాంటి దేశాలే అభివృద్ధి పథంలో పయనిస్తాయని అభిప్రాయపడ్డారు. కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందడం వల్ల క్రమశిక్షణతో పాటు మానసిక శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. తద్వారా వారు ఎంచుకున్న రంగాల్లో వారు మరింత రాణించగలుగుతారని తెలిపారు. ప్రపంచంలోని అన్ని దేశాలు యువసంపద కోసం మన దేశం వైపు చూస్తున్నాయని వివరించారు. యువతను క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదించినప్పుడే మన దేశం ప్రపంచంలోనే అన్ని దేశాలకు నాయకత్వాన్ని వహించే స్థాయికి ఎదుగుతుందని వివరించారు. కర్నూలు నగరంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు సామాజిక సేవా దృక్పథంతో క్రీడలను ప్రోత్సహించేందుకు నిరంతరం తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. తైక్వాండో సీనియర్ శిక్షకుడు టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


క్రీడాకారులకు బ్యాగులు, మంకీ క్యాప్ లు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

7న మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఈనెల 7న జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి ఆయా పాఠశాలల పూర్వ విద్యార్థులు హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్ పాల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వివిధ పాఠశాలల్లో చదివిన పూర్వ విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా లేదా దేశవ్యాప్తంగా ఎక్కడున్నా, వారు చదువుకున్న పాఠశాలల్లో డిసెంబర్ 7న జరిగే మెగా పేరెంట్స్,టీచర్స్ సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమావేశాన్ని విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు నిర్వహిస్తోందని, అందులో పూర్వ విద్యార్థులు కూడా భాగస్వాములు కావాలని డిఇఒ పిలుపు నిచ్చారు.

ప్రభుత్వం సంపద సృష్టి అబద్ధం

-ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం నిజం
-వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్‌వి. మోహన్ రెడ్డి

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్


మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

సంపద సృష్టిస్తామని చెప్పి టిడిపి ప్రభుత్వం అబద్ధం చెప్పిందని, విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం వేయడం నిజమని వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలు వైసిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థికంగా రాష్ట్రఅభివృద్ధి చేస్తామని చెప్పి బాబు కరెంట్ చార్జీల పేరుతో రూ.15 వేల కోట్లు ప్రజలపై భారం మోపారని అన్నారు. తాజాగా రూ.9 వేల కోట్ల విద్యుత్ భారం ప్రజలపై మోపడంతో ఇంట్లో కరెంటు స్విచ్ వేయాలంటే భయమేస్తోందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఒక్క యూనిట్ కు రూ.2.19 విద్యుత్ చార్జీలు పెంచబోతున్నారు. బాబు రూ.75 వేల కోట్ల అప్పు చేసి ప్రజలకు ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయకుండా విఫలమయ్యారని విమర్శించారు. సెకి పేరుతో విద్యుత్ ఒప్పందంలో ఏదో జరిగిందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై ఎల్లో మీడియా, టిడిపి నేతలు అసత్య ఆరోపణలు చేశారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన వారికి సంక్షేమ పథకాలు అమలు చేశారని అన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలతో మహిళలు బ్యాంకులు, పోస్ట్ ఆఫీస్ లకు చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించే చర్యలు చేపట్టాలన్నారు.

రైల్వేవ్యాగన్ పూర్తిచేసి ఉద్యోగాలివ్వాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు రైల్వే వ్యాగన్ వెంటనే పూర్తి చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర , ప్రధాన కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు మండలం డివైఎఫ్ఐ జనరల్ బాడీ సమావేశం మండల కార్యదర్శి ప్రకాష్ అధ్యక్షతన డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. నగేష్, రాఘవేంద్ర మాట్లాడుతూ కర్నూలు మండలం పంచలింగాల సమీపంలో కర్నూలు రైల్వే వ్యాగన్ నిర్మాణం చేసి జిల్లా యువతకు ఉద్యోగాలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి పదేళ్లు అవుతుందన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీ నేటికి అమలు కాలేదని అన్నారు. నత్తనడకన నడుస్తున్న రైల్వే వ్యాగన్ ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. వెంటనే కర్నూల్ రైల్వే వ్యాగన్ పూర్తిచేసి యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన జిల్లాగా కర్నూలు జిల్లా ఉందని, జిల్లా అభివృద్ధి కోసం పరిశ్రమలు సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలని అన్నారు. అక్షరాస్యతలో కూడా జిల్లా వెనకబాటులో ఉందని అన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం జిల్లాలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు జిల్లా అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. పరిశ్రమలు , ప్రాజెక్టులు, జిల్లా అభివృద్ధి కోసం యువత ఐక్యతతో పని చేయాలని కోరారు. సమావేశంలో మండల నాయకులు సురేష్,హరికిషన్ రెడ్డి, వైశంకర్, వాకర్, నాగప్ప, రాజు ,కమిటీ సభ్యులు ఎన్.రాజు, రాము దస్తగిరి, మహేష్ అంజి హరి వివిధ గ్రామాల యువకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వై.నగేష్

ప్రతి పౌరుడికి రాజ్యాంగం ఒక కర దీపిక

సెమినార్‌లో వక్తలు

ప్రజాశక్తి- ఎమ్మిగనూరు

భారతదేశంలో నివసించే ప్రతి పౌరునికి రాజ్యాంగం ఒక కర దీపిక అని వక్తలు సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి గోవిందు, సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి రంగన్న, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాసిం వలి, సిపిఐ(ఎం ఎల్) న్యూ డెమోక్రసీ కార్యదర్శి రాజు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు దేవేంద్ర బాబు, ఎంపిజె రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ఎండి ఖాదిర్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మిగనూరు కెవిపిఎస్ జిల్లా ఉప కార్యాలయంలో రాజ్యాంగ లక్ష్యాలు దాని ప్రాముఖ్యత అనే అంశంపై కెవిపిఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్.తిమ్మన్న అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తులు మాట్లాడుతూ హిందువులకు భగవద్గీత, ముస్లింలకు ఖురాన్, క్రైస్తవులకు బైబిల్ ఎలాగో భారతదేశంలో ప్రతి పౌరునికి భారత రాజ్యాంగం ఒక పవిత్రమైన గ్రంథమని, దానికి అందరూ శిరసా వహించాలన్నారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం కల్పిస్తూ అందరితో సమానంగా జీవించే హక్కును ఆర్టికల్ 21లో చేకూర్చిందన్నారు. సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం కావాలంటే ప్రతి పౌరుడు విద్యా ద్వారానే సాధించగలరని అన్నారు. 1949 నవంబర్ 26న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగం అమలు ద్వారా రాజకీయ న్యాయం మాత్రమే అందుతుందని, దేశంలో సామాజిక, ఆర్థిక, అంతరాలు ఉన్నాయని వాటిని అంతమొందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆనాడే చెప్పారన్నారు. కుల వ్యవస్థ కూడా మన జిల్లాలోని కర్నూలు పశ్చిమ ప్రాంతంలో ఎక్కువగా ఉందని అన్నారు. రాజ్యాంగంలో రిజర్వేషన్లు అనేది సామాజిక వెనుకబడిన వారికి మాత్రమే రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అందులో కులాలను అంటగడుతూ విద్వేషాలు నింపుతున్నారన్నారు. నేడు దేశాన్ని పాలిస్తున్న పాలకులు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడానికి కుట్ర పన్నుతున్నారని,ఇది కూడా రాజ్యాంగానికి విఘాతం అని అన్నారు. కనీస వేతన చట్టం అమలు చేయడం లేదని అన్నారు. మద్యపాన నిషేధం అనేది కూడా రాజ్యాంగంలో ఒక నిర్ణయమని దీన్ని నేటి రాష్ట్ర ప్రభుత్వాలు ఒక ఆర్థిక వనరుగా తయారు చేసుకుని ప్రజల నుండి డబ్బులు కొల్లగొడుతున్నాయన్నారు. స్వేచ్ఛ సమానత్వం సాధించినప్పుడే సామాజిక చైతన్యం సాధ్యమవుతుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని రద్దుచేసి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని ప్రయత్నిస్తుందన్నారు. ఆ శక్తులను ఎదుర్కోవడానికి మానవతవాదులు, వామపక్షవాదులు, సామాజిక ఉద్యమకారులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంలోని సామ్యవాదం సోషలిజం అనే పదాలను తొలగించాలని బిజెపి, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్తులు ప్రయత్నిస్తాయన్నారు రాజ్యాంగ ని కాపాడుకోవడానికి ప్రతి పౌరుడు నడుం బిగించాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సురేష్, ఆంథోనీ, రాజు, దావీదు, నరసింహులు, రాముడు, మనోహర్, ఎంపిజి ఖాదర్ బాష, ఆదెన్న, భాస్కర్, ఎల్లప్ప, రాఘవేంద్ర, నాగరాజు, జ్ఞాన ప్రకాష్ రామయ్య ,రామాంజనేయులు ,ఆనందరావు ప్రసాద్ పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న సిపిఎం డివిజన్ కార్యాదర్శి సి.గోవిందు

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి ఆదోని

పేదరిక నిర్మూలనకై ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ప్రతి ఒక్కరు లబ్ధి పొందాలన్నదే సంకల్పమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాజీ ఇంచార్జి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు కావాలంటే బియ్యం కార్డు అవసరమన్నారు అర్హులైన వారందరూ లబ్ధి పొందాల నాదే లక్ష్యంగా త్వరలోనే కొత్త



బియ్యం కార్డు కొరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కలిపిస్తుందన్నారు ఈనెల మొదటి వారంలోనే వితంతు, దివ్యాంగుల ,వద్ధులకు కొత్త పెన్షన్ ఆన్లైన్లో వివరాల నమోదుకు రాష్ట్ర వ్యాప్తంగా మొదలు పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు అర్హత ఉన్న వాళ్ళందరూ నమోదు చేసుకోవాలని కొత్త రేషన్ కార్డులు కొరకు దరఖాస్తులు చేసుకుని సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందాలని కోరారు ....

ఎయిడ్స్‌పై విస్తృత ప్రచారం అవసరం

ప్రజాశక్తి-ఆదోని : సుఖ వ్యాధుల వ్యాప్తి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని వన్ టౌన్ సిఐ శ్రీరాములు, ఆర్డిప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కట్టాస్వామిదాసు పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా ఆదోనిలో వీధుల గుండా ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సౌజన్యంతో ఆర్డీప్ స్వచ్ఛంద సంస్థ ప్రపంచ ఎయిడ్స్ దినం అవగాహన స్టాల్‌ను శ్రీనివాస భవన్ కూడలిలో ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. అవగాహన స్టాల్‌ను సిఐలు శ్రీరాములు, సూర్యమోహన్‌రావు ప్రారంభించారు. కాండోమ్స్ ఉపయోగించే విధానం, సుఖ వ్యాధులు సంక్రమించే పరిస్థితులు గురించి అక్కడ వారికి స్వచ్ఛంద సంస్థ ఉద్యోగులు అవగాహన కల్పించారు. సిఐలు మాట్లాడుతూ హెచ్ఐవి అనేది అంటువ్యాధి కాదు అంటించుకునే వ్యాధి అని తెలిపారు. పరీక్షించని రక్తం ఎక్కించుకోవడం, కండోమ్స్ లేకుండా అపరిచిత వ్యక్తులతో సెక్స్ చేయడం వంటివి హెచ్ఐవి వ్యాధికి కారణాలు అన్నారు. ఆర్డిప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కట్టా స్వామి దాస్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో దశాబ్ద కాలంగా హెచ్ఐవి వ్యాప్తి నివారణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. హెచ్ఐవి రోగులపట్ల సమాజం, కుటుంబం వివక్ష చూపరాదన్నారు. మందులు అందించి రోగి లోని ఆత్మస్థైర్యాన్ని నింపి వారి కుటుంబాలకు తగిన సహాయం చేయాలని తెలిపారు. ప్రాజెక్ట్ మేనేజర్ మాలిక్ మాట్లాడుతూ హెచ్ఐవి రోగులను గుర్తించి వారికి మందులు పంపిణీ చేయిస్తూ తరచుగా పరీక్షలు చేయిస్తున్నామన్నారు. ఎయిడ్స్ లక్షణాలు ఉన్నవారు సంప్రదిస్తే తగిన కౌన్సిలింగ్ ఇస్తామని చెప్పారు.ోగికి వ్యాధి నిరోధక శక్తి తగ్గకుండా తీసుకోవాల్సిన ఆహారంసెక్సువల్‌గా జాగ్రత్తలు వివరించారు. డిఎస్ఆర్‌సి కౌన్సిలర్ శేఖర్ మాట్లాడుతూ అంగం పై పుండ్లు ఏర్పడడం, చీము కారడం, ఒంటిలో మంటగా ఉండడం వంటివి సుఖ వ్యాధులు అని వివరించారు. న్యాయవాదులు, ఆర్డిప్స్ సంస్థ ఉద్యోగులు ఉన్నారు.

ఒకవైపు మార్పు.. మరోవైపు నిలువు దోపిడి..!

పజాశక్తి- కౌతాళం

శ్రీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో ఒకవైపు మార్పులు జరుగుతుంటే.. మరోవైపు భక్తుల నిలువు దోపిడీ కొనసాగుతూనే ఉంది. శ్రీశైలం దేవస్థానం తర్వాత అత్యంత ఆదాయం సమకూర్తున్న దేవస్థానం శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం. ఈ పుణ్యక్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాలతో పాటు, కార్తీకమాసం ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు లక్షలాదిమంది భక్తులు వివిధ రాష్ట్రాల నుండి పుణ్యక్షేత్రానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుంటారు. ఈ ఉత్సవాలు కాకుండా సోమ, గురువారాలతోపాటు అమావాస్య రోజు భక్తులు భారీగా తరలివచ్చి తమ మొక్కుబడులను తీర్చుకుంటారు. ఈ దేవస్థానానికి అసిస్టెంట్ కమిషనర్ నుండి డిప్యూటీ కమిషనర్ హోదా దేవదాయ శాఖ అధికారులు కల్పించారు.

మార్పులు: శ్రీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి డిప్యూటీ కమిషనర్‌గా విజయరాజు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పలు మార్పులు చేశారు. నిత్య అన్నదాన సత్రంలో ముందుగా మార్పులు చేపట్టారు. గతంలో భక్తులకు అన్నదాన సత్రంలో నాణ్యతతో కూడిన భోజనం లభించేది కాదు. ప్రస్తుతం అన్నం తో పాటు, ఆకుకూరతో కూడిన పప్పు, కూరగాయలతో కూడిన సాంబారు, ఏదో ఒక రకమైన పచ్చడి, గట్టి పెరుగుతో పాటు డ్రై ఫ్రూట్‌తో కూడిన పాయసం అందిస్తున్నారు. ఈ మార్పు రావడంతో భక్తులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆదాయం పెరిగింది: డిప్యూటీ కమిషనర్ విజయరాజు చేపట్టిన కొన్ని చర్యల వల్ల గతంలో కంటే దేవాలయానికి ఆదాయం పెరిగింది.

ఆన్‌లైన్ ద్వారా సేవలు: పుణ్యక్షేత్రానికి చేరుకునే భక్తులకు వసతి గృహాల కోసం పుణ్యక్షేత్రానికి చేరుకొని తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా వసతి గృహాన్ని బుక్ చేసుకొనే సౌకర్యాన్ని కల్పించారు. దీనితోపాటు వసతి గృహాల శుభ్రత పట్ల ప్రత్యేక దృష్టిని సారించారు.

భక్తుల నిలువు దోపిడి: శ్రీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో భక్తుల నిలువు దోపిడీ కొనసాగుతూనే ఉంది. దీంతో నిరుపేద భక్తులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ జరుగుతున్న దోపిడి రాజ్యానికి భక్తుల జేబులకు చిల్లులు పడుతున్నాయి.

అధిక ధరలకు టెంకాయలు: అధిక ధరలకు టెంకాయలు అమ్మకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిలో సుమారు 20 లక్షలకు పైగానే భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. స్వామివారికి సుమారుగా మూడున్నర లక్షల నుండి నాలుగు లక్షల వరకు టెంకాయలు (కొడుతారు) సమర్పించుకుంటారు. దేవాలయ నిబంధనల మేరకు టెంకాయలు భక్తులకు అమ్మాల్సి ఉండగా, అధిక ధరలకు అన్ని సొమ్ము చేసుకుంటున్నారు. జత టెంకాయలు రూ.70 నుండి రూ.80 వరకు అమ్మకాలు జరిపి భక్తులకు నిలువు దోపిడీకి గురి చేస్తున్నారు. పుణ్యక్షేత్రంలో టెంకాయల ధరల పట్టిక దేవాలయ అధికారులు ఎక్కడ ఏర్పాటు చేయకపోవడం, అధిక ధరలకు అమ్ముతున్న వారిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్వం.

భక్తులకు గుండు కొడుతున్నారు: స్వామివారికి మొక్కుబడి కింద తలనీలలో సమర్పించే భక్తులకు జేబులు చిరిగేలా గుండు కొడుతున్నారు. అధికారులు కేటాయించిన తలనీలలో టికెట్లు భక్తులు తీసుకున్న కూడా కళ్యాణ కట్ట వద్ద గుండుకు రూ.వంద ముక్కు పిండి వసూలు చేస్తున్నారు.

నీటి వ్యాపారం: కోట్లల్లో ఆదాయమున్నా భక్తులకు మాత్రం తాగునీరు అందడం లేదు. దేవాలయ అధికారులు గుడిలో మాత్రం డ్రమ్ముల ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. పుణ్యక్షేత్ర పరిసరాలలో తాగునీరు అందకపోవడంతో నీటి వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా కొనసాగుతుంది. వీరి వ్యాపారానికి పరోక్షంగా అధికారుల సహాయ హకారులు లభిస్తున్నాయి. ఉత్సవాల సమయంలో ఒక నీటి బబుల్ రూ.50 నుంచి రూ.70 వరకు పలుకుతుంది. భక్తుల నుండి దేవాలయానికి ఆదాయం సమకూరుతున్న కనీసం తాగునీటి సౌకర్యం కోసం శాశ్వత పరిష్కారం లభించడం లేదు.

వసతి గహాల కొరత: క్రమంగా అభివృద్ధి చెందుతున్న క్షేత్రం, ప్రతి ఏడాదికి భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉంది. దాతల సహకారంతో కొన్ని, దేవస్థానం ద్వారా కొన్ని వసతి గృహాలు నిర్మించారు.



ఇందులో ఈరన్న స్వామి సేవ సదన్-1 లో వసతి గహాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఉత్సవాల సమయంలో ముఖ్యమైన రోజుల్లో వసతి గహాలు అందక భక్తులు పుణ్యక్షేత్రం పరిసరాలలోనే నిద్ర చేస్తున్నారు. భక్తులకు సేవలు అందించడానికి కృషి చేస్తున్న డిప్యూటీ కమిషనర్ విజయరాజు, భక్తులు నిలువు దోపిడీ కి గురికాకుండా చూడాలని ఈరన్న స్వామి భక్తులు కోరుతున్నారు. దేవాదాయ శాఖ నిబంధనల మేరకు టెంకాయలు ధరలు ఉండేటట్లు చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తలనీలాలు సమర్పించడానికి ఎక్కువమంది పేద భక్తులే వస్తుంటారు. కళ్యాణ కట్టలో కూడా వసూళ్లను నివారించాలని భక్తులు కోరుతున్నారు.

రూ.70 జత టెంకాయలు: భక్తుడు బసవరాజు

కార్తీక మాసం సందర్భంగా నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనం కోసం వచ్చామని బసవరాజు అనే భక్తుడు తెలిపారు. మొక్కుబడును కింద టెంకాయలు కొడదామని, కొంటె రూ.70 రెండు టెంకాయలు అమ్ముతున్నారని వివరించారు.

గుండుకు రూ.100 వసూలు: శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో తలనీలలో సమర్పించాలంటే రూ.వంద సమర్పించు కోవాల్సిందే అని భక్తుడు నరసింహ పేర్కొన్నారు. తలనీలాలు టికెట్ తీసుకున్న కూడా గుండుకు అదనంగా వంద రూపాయలు చెల్లించాల్సిందే..!



భక్తులు నరసింహా,



భక్తుడు బసవ రాజు,



డిప్యూటీ కమిషనర్ విజయరాజు

బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కూటమి లక్ష్యం

ప్రజాశక్తి-ఆస్పరి: రాష్ట్రంలోని బడుగు బలహీనవర్గాల అభివృద్ధి క్యూటమి ప్రభుత్వం లక్ష్యం అన్ని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం ప్రసాద్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అట్టేకల్లు, బిల్లేకల్లు గ్రామాలలో పర్యటించి సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవాళ్లకు ఎన్టీఆర్ భరోసా ద్వారా ఇల్లు మంజూరు చేసి నిర్మిస్తామన్నారు. అర్హులై ఇల్లు, రేషన్ కార్డు, పెన్షన్‌రాని వాళ్ళు సచివాలయలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముందుగా అట్టేకల్లు గ్రామంలోని పరదేశప్ప తాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. అనంతరం నాయకులు వైకుంఠం శివప్రసాద్‌కు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు. సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ, మాజీ ఎంపిపి వెంకటేష్, సొసైటీ మాజీ ఛైర్మన్ నౌనేపాటి చౌదరి, నాయకులు జీవన్ కుమార్, సంజప్ప, మహేష్, వీరేష్, మహానంది, శ్రీనివాసులు, రాజశేఖర్ లు పాల్గొన్నారు.

4న సిపిఎం 3వ మండల మహాసభ

ప్రజాశక్తి - ఆలూరు



ఆలూరు సిపిఎం 3వ మండల మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి షాకీర్ అన్నారు. ఆదివారం జ్యోతిబసు భవన్‌లో సిపిఎం సీనియర్ నాయకులు కెపి నారాయణ స్వామి అధ్యక్షతన నిర్వహించిన సిపిఎం కార్యకర్తల సమావేశంలో షాకీర్ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక, మహిళా,రైతు, ప్రజల పక్షాన నిరంతరం రాజీలేని పోరాటం చేసే సిపిఎం 3వ ఆలూరు మండల మహాసభలు డిసెంబర్ 4న జ్యోతిబసు భవన్ లో నిర్వహిస్నున్నట్లు తెలిపారు. సిపిఎం నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టినా భయపడకుండా నియోజకవర్గం అభివృద్ధి కోసం, వేదవతి రిజర్వాయర్ నిర్మాణం సాధన కోసం, రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అనేకరకాలుగా ఆందోళనలు, పోరాటాలు చేసిందన్నారు. గత మహాసభల్లో చేసుకున్న తీర్మానాలు అమలు చేస్తూ వాటి సాధన కోసం మండల కమిటీ కృషి చేసిందన్నారు. ఆలూరు అభివృద్ధి కోసం ఈ మహాసభలో తీర్మానాలు చేయనుందన్నారు. సిపిఎం కార్యకర్తలు, పార్టీ సభ్యులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మండల నాయకులు ఈరన్న, కృష్ణ, ఈశ్వర్ గౌడ్, మైన, గోవర్ధన్, విఠల్, నాగరాజు,షేకున్ బి.రత్నమ్మ, గోసియాబి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు ఇవ్వాలి

ప్రజాశక్తి - ఆదోని

స్వయం ఉపాధి కోసం కుట్టు శిక్షణ పొందిన మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేయాలని దూల్హా ఫైల్వాన్ మసీదు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అల్లా బకాష్, షేక్ జక్రియలు ప్రభుత్వాన్ని కోరారు. మసీదు మైదానంలో దుల్హా ఫైల్వాన్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళల ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన 180 మంది మహిళలకు ఆదివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కులమతాలకు అతీతంగా శిక్షణ పొందుతున్నారని, కేవలం నెలకు రూ. 200లతో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మసీదు కమిటీ ఆధ్వర్యంలో అతి తక్కువ ఫీజులతో ఇంగ్లీష్ మీడియం స్కూల్ నర్సరీ నుండి ఏడవ తరగతి వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే మసీదు కమిటీ ఆధ్వర్యంలో నర్సింగ్ సెంటర్ అలాగే ఉన్నత విద్య, ఉపాధి కోసం శిక్షణ కేంద్రాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఖతిబ్ సాబ్ జునైద్ హాష్మి, మసీదు కమిటీ ఉపాధ్యక్షులు ఖాదర్ బాషా, కమిటీ సభ్యులు సీనియర్ రిపోర్టర్ గౌస్ మహమ్మద్, మసీదు ఇమామ్ సాబ్ ఆఫీజ్ మున్నావర్ సాబ్, దాదాబాష, రషీద్ పటేల్, న్యాయవాది ఇస్మాయిల్, మదీనా మసీదు కమిటీ సభ్యులు బందే నవాజ్, కాలనీ వాసులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆదోని

సెలవు రోజుల్లో తరగతులను నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ కళాశాల, పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక తరగతులతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారి స్పందించి తనిఖీలు నిర్వహించి సంబంధిత విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని ఎడల తరగతులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి అలాంటి విద్యా సంస్థలకు నోటీసులు ఇచ్చి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సంతోష్, శశిధర్, ప్రతాప్, యశ్వంత్, మధు, సూరి ఉన్నారు.

హెచ్‌ఎం శేషాద్రికి కర్ణాటక సాధకరత్న అవార్డు

ప్రజాశక్తి-హోళగుంద

వందవాగిలి ఎంపిపి కన్నడ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న హెచ్‌వై శేషాద్రి డిసెంబర్ 1న ఆదివారం కర్ణాటక సాధకరత్న అవార్డును అందుకున్నారు. బళ్లారి నగరంలో శ్రీమహాదేవ ఎడ్యుకేషన్ ఆర్ట్ అండ్ కల్చర్ ట్రస్ట్, బళ్లారి జిటి ఫౌండేషన్ , శ్రీఎస్ఆర్ఎం సేవా సంస్థ ఆధ్వర్యంలో కర్ణాటక సాహిత్య , సాంస్కృతిక సమ్మేళనాన్ని నిర్వహించారు. కన్నడ భాష సంస్కృతి సాంప్రదాయాల కొరకు విశేషంగా కృషి చేస్తున్న వందవాగిలి ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్‌వై శేషాద్రిని ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఘనంగా సన్మానించి కన్నడ,సాంస్కృతిక సమ్మేళన అధ్యక్షులైన బసవరాజ్ బిసలళ్ళి అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ వై శేషాద్రి కృషిని అభినందించారు. కన్నడ సాహిత్య సాంస్కృతిక సంఘాల అధ్యక్షులు బసవరాజు, కోశాధికారి హరిప్రసాద్, ఎల్.పద్మావతి ,ఎల్.రామాంజనేయులు దొడ్డబసప్ప, వైడి గురుశాంత జి.వెంకటేష్, కురుగోడు శ్రీనివాసులు పాల్గొన్నారు.



శ్రీ మఠంలో ఘనంగా స్వర్ణ పల్లకోత్సవం


ప్రజాశక్తి-మంత్రాలయం

శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో స్వర్ణ పల్లకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్వామి వారికి స్వర్ణ పల్లకి సేవ చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం స్వామి వారి బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ శ్రీ మఠం ప్రాకారంలో సేవా దారులతో పల్లకి మోయించి పల్లకోత్సవం నిర్వహించారు.

ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తులు

టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి-మంత్రాలయం



ఇంటి స్థలాలు ఉండి ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాలు అవసరమైన వారు ధరఖాస్తులు చేసుకోవచ్చని టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని తన స్వగహం నుంచి సమాచారం అందించారు. గుడిసెలు లేని రాష్ట్రంగా చూడాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం పై దృష్టి సారించి కూటమి ప్రభుత్వం ప్రస్తుతం కొత్త ఇళ్ల నిర్మాణం కోసం ధరఖాస్తులు ఆహ్వానిస్తుందని తెలిపారు. ఇక ప్రజలకు సొంతింటి కల నెరవేరే రోజులు దగ్గరలో ఉన్నాయని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో ఇంటి నిర్మాణం కోసం రూ.1.80 లక్షల ఇవ్వగా కూటమి ప్రభుత్వం ప్రతి ఇంటి నిర్మాణం కు రూ.క్షల ఇస్తుందన్నారు. సొంత ఇల్లు లేని వారికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై) 2. కింద కొత్త గృహాల మంజూరుకు గ్రామ వార్డు సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు లేదా హౌసింగ్ అధికారులకు దరఖాస్తులు ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఇళ్ల మంజూరుకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి అధికారులకు అందించే బాధ్యత నాలుగు మండలాల్లోని నాయకులు కార్యకర్తలు తీసుకోవాలని సూచించారు.

ఆహార కల్తీకి పాల్పడితే చర్యలు: ఎఫ్‌సి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్ : ఆహార పదార్థాల తయారీలో కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కర్నూలు ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కె.కూర్మానాయకులు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వ్యాపారులు ఆహార పదార్థాల తయారీలో కర్నూలు ఉమ్మడి జిల్లాలో దాడులు చేపడుతున్నామన్నారు. ఇందులో నంద్యాల జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ చివరి వరకు వివిధ వ్యాపార సంస్థల నుంచి 169 ఆహార నమూనాలను సేకరించామన్నారు. కల్తీ నిర్ధారణ చేసినవి 6 కేసులు, నాణ్యత లోపం సంబంధించి ఎనిమిది కేసులు టిపిసి మీటర్ ద్వారా సేకరించిన శాంపిల్స్ 6 కేసులు నమోదు చేయగా 220 చిన్న హోటల్లు, 86 పెద్ద హోటల్ల ను తనిఖీ చేశామన్నారు. కర్నూలు జిల్లాలో మొత్తం 147 ఆహార పదార్థాల నమూనాలను సేకరించామన్నారు. ఇందులో 13 ఆహార కల్తీ జరిగినట్లు నిర్ధారణ చేశామన్నారు. 17 నాణ్యత లోపంగా గుర్తించామన్నారు. ఇందులో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, పండ్ల జ్యూస్ షాపులు, డ్రైఫ్రూట్ షాపులు, స్వీట్ షాపులు, బిరియాని హోటల్లు, ఉన్నట్లు పేర్కొన్నారు.



ఎఫ్‌సి కె.కుర్మానాయకులు

తైక్వాండో శిక్షణ ధైర్యాన్ని పెంచుతుంది

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి -కర్నూలు జిల్లాపరిషత్

తైక్వాండో శిక్షణ ధైర్యాన్ని నిజాయితీని పెంచుతుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి అన్నారు. ఆదివారం 17వ వార్డులోని సప్తగిరి నగర్, అయ్యప్ప గుడి ప్రక్కన ఉన్న చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో తైక్వాండో శిక్షణ తీసుకుంటున్న పిల్లలకు కలర్ బెల్టుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. తైక్వాండో మాస్టర్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చరితారెడ్డి, సిపిఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి,19వ వార్డు టిడిపి ఇన్చార్జి ప్రభాకర్ యాదవ్, 3 టౌన్ సిఐ శేషయ్య శిక్షణ పొందిన క్రీడాకారులకు కలర్ బెల్టులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో కార్పొరేట్ స్కూల్స్ వ్యవస్థ రావడంతో నేటి తరం పిల్లలకు గేమ్స్ పట్ల ఆసక్తి లేకపోవడం పిల్లల తల్లిదండ్రులు చదువులు, ర్యాంకులు అనే విధానంలో ఉండడం వల్ల పిల్లలు శారీరకంగా బలంగా లేక అంంనేక రకాల వ్యాధులకు గురవుతున్నారు. నేటి సమాజంలో బయటకి వెళ్ళిన పిల్లలు ఇంటికి వస్తారో రారో అన్న భయంతో పిల్లల తల్లిదండ్రులు భయపడతున్నారన్నారను. ఇలాంటి తరుణంలో తైక్వాండో శిక్షణ పిల్లలు తీసుకోవడం ద్వారా ధైర్యంగా, నిజాయితీగా సమాజంలో ఎదగడానికి ఎంతో ఉపయోగపడుతుందని, ఇలాంటి శిక్షణలు ఇవ్వడానికి మాస్టర్లకు ఏ అవసరం వచ్చినా తానున్నానని హామీ ఇచ్చారు. జోహరాపురం దగ్గర పాత డంపింగ్ యార్డ్‌ను తరలించి అక్కడ ఇలాంటి పిల్లల కోసం స్టేడియాన్ని నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి కర్నూలు నగరంలో భాగమైన పాణ్యం నియోజకవర్గంలో రెండవ స్టేడియం నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సిపిఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పిల్లలకు చదువులతో పాటు క్రీడలు, క్రీడలతో పాటు తైక్వాండో, కరాటే లాంటి శిక్షణ కూడా చాలా అవసర మని అన్నారు. ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు, తైక్వాండో శిక్షణ మాస్టర్స్ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తైక్వాండో క్రీడాకారునికి బెల్టు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే గౌరుచరిత